TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్
# వందే భారత్
Voice of Vande Bharath
తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 54 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ శుక్రవారం | జూన్ 05, 2026


2లో..

## పర్యావరణ విధ్వంసానికి అడ్డేది..?

ప్రతి ఏటా జూన్ 5వ తేదీ రాగానే ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. మొక్కలు నాటడం, ఫొటోలకు పోజులివ్వడం, సైకిల్ ర్యాలీలు తీయడం వంటి హడావుడి కనిపిస్తుందే తప్ప, వాతావరణంలో ఆశించిన మార్పు రావడం లేదు. పాలకుల్లో చిత్తశుద్ధి లోపించడం, పర్యావరణ పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల 'ఎల్ నినో' వంటి ప్రకృతి ఉత్పాతాలు మానవాళిపై విరుచుకుపడుతున్నాయి. ఈ ఏడాది కూడా నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా ప్రవేశించడమే కాకుండా, జూన్ వచ్చినా ఎండల తీవ్రత తగ్గకపోవడం పర్యావరణ సంక్షోభానికి అద్దం పడుతోంది. ఒకప్పుడు జూన్ ప్రారంభానికే జోరు వానలు కురిసేవని, నేడు ఆ పరిస్థితి ఎక్కడా కానరాకపోవడం ఆందోళనకరం.

వాయిస్ ఆఫ్ వందేభారత్, స్పెషల్ డెస్క్ -

- ఏటేటా పెరుగుతున్న తీరు ఆందోళన కరం
- మృగ్యమవుతున్న అడవులు
- మురికికూపాలుగా మారుతున్న నదులు..
- ప్రాణాంతక వాయు కాలుష్యం
- చట్టాలు చుట్టాలైతే.. మనుగడకే ముప్పు
- ప్రకృతి ఆరాధన భారతీయ జీవన విధానం

## పాలన చేతకాకపోతే
### సీఎం పదవికి రాజీనామా చెయ్

- రేవంత్‌రెడ్డిపై ఎంపీ అర్వింద్ ఫైర్
- కేంద్రాన్ని తిడుతూ సమస్యలను దాటవేస్తారా?
- ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు ప్రణాళికేది?
- దొంగ ఇసుకకు లారీలు ఉంటాయి..
- రైతుల ధాన్యానికి లారీల కొరతా?


2లో..

## పోలీసుల అదుపులో నేపాలీ గ్యాంగ్

- పుణెలో మరో నలుగురు నిందితుల పట్టివేత
- ముఠాలో మొత్తం ఆరుగురు అరెస్ట్
- హైదరాబాద్‌కు తరలిస్తున్న మల్కాజిగిరి పోలీసులు
- రిటైర్డ్ ప్రొఫెసర్ ఇల్లే లక్ష్యంగా సాగిన భారీ దోపిడీ

2లో..

## యథాతథంగా రెపో రేటు

- ఆర్‌బీఐ ద్రవ్యపరపతి విధానం వెల్లడి
- 5.25 శాతం వద్దే కొనసాగనున్న కీలక వడ్డీ రేటు
- గవర్నర్ సంజయ్ మల్హోత్రా


2లో..

**ముంబై, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా ఉంచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్లో అస్థిరత, పశ్చిమాసియా సంక్షోభం కొనసాగుతున్న తరుణంలో దేశీయ ఆర్థిక వ్యవస్థను సురక్షితంగా ఉంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు చేయలేదని, దీనిని 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు ప్రకటించారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. అంతర్జాతీయ సవాళ్ల నేపథ్యంలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను దేశ జీడీపీ వృద్ధి రేటు అంచనాలను ఆర్‌బీఐ 6.9 శాతం నుంచి 6.6 శాతానికి తగ్గించింది.

( మిగతా వివరాలు 2వ పేజీలో.. )

## పర్యావరణంతో సంబంధం లేదని ఎవరూ అనుకోవద్దు

- మంత్రి పొన్నం ప్రభాకర్
- కృష్ణకాంత్ పార్క్‌లో మొక్కలు నాటిన మంత్రి
- హైదరాబాద్‌కు ఢిల్లీ లాంటి కాలుష్య ముప్పు రావొద్దు
- ఇంటింటికీ ఇంకుడు గుంతలు, మొక్కలు తప్పనిసరి

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవంతో నాకు సంబంధం లేదని ఎవ్వరూ నిర్లక్ష్యం వహించవద్దని, ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 'అశోక చక్రవర్తి ఆనాడు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటించారు.. నేటికీ మనం ఆ విషయాన్ని చరిత్రలో గొప్పగా చెప్పుకుంటున్నాం' అని ఆయన గుర్తు చేశారు. భవిష్యత్ తరాల మనుగడను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని కృష్ణకాంత్ పార్క్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల' యాక్షన్ ప్లాన్‌లో భాగంగా.. నేటి నుంచి 12 రోజుల పాటు అటవీ శాఖ (ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్) ఆధ్వర్యంలో పర్యావరణ సంరక్షణ కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతాయని వెల్లడించారు. దేశ రాజధాని ఢిల్లీ ప్రస్తుతం తీవ్ర కాలుష్యపు కోరల్లో చిక్కుకుందని, భాగ్యనగరానికి అలాంటి దుస్థితి రాకూడదనేదే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. నగరవాసులు వీలైనంత వరకు సొంత వాహనాల వాడకాన్ని తగ్గించి, పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. నీటి పొదుపు – ఇంకుడు గుంతలు: భవిష్యత్తులో వర్షాలు కురవక తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని మంత్రి




హెచ్చరించారు. ప్రస్తుతం ఎక్కడ బోర్లు వేసినా నీరు పడే పరిస్థితి లేదని, కాబట్టి ప్రతి ఒక్కరూ నీటిని పొదుపు చేయడంతో పాటు ఇళ్లలో విధిగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలని పిలుపునిచ్చారు. భూమిలో సులభంగా కలిసిపోయే పర్యావరణ హిత వ్యర్థాలను, వస్తువులను మాత్రమే వాడటం అలవాటు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి నవీన్ యాదవ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, అటవీ శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
శుక్రవారం, జూన్ 05, 2026

## పాలన చేతకాకపోతే సీఎం పదవికి రాజీనామా చెయ్

- రేవంత్‌రెడ్డిపై ఎంపీ అర్వింద్ ఫైర్
- కేంద్రాన్ని తిడుతూ సమస్యలను దాటవేస్తారా?
- ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు ప్రణాళికేది?
- దొంగ ఇసుకకు లారీలు ఉంటాయి..
- రైతుల ధాన్యానికి లారీల కొరతా?



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలో పాలన చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవికి రేవంత్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ డిమాండ్ చేశారు. వరి ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే కేంద్రంపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. శుక్రవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ అరవింద్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బీజేపీ నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని అరవింద్ ధ్వజమెత్తారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, ఇలాంటి చౌకబారు రాజకీయాలు చేయడం తగదన్నారు. ఇది సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. వరికోతలు ప్రారంభమయ్యే ముందే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన ప్రాథమిక బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. ఆ పని చేయడంలో ఘోరంగా విఫలమై, ఇప్పుడు కేంద్రంపై నెపం మోపడం సరికాదన్నారు. రాష్ట్రంలో దొంగ ఇసుక, మొరం రవాణా చేయడం కోసం వందలాది ట్రాక్టర్లు, లారీలు అందుబాటులో ఉంటాయని.. మరి రైతుల ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు మాత్రం లారీల కొరత ఎందుకు వస్తుందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లైస్ ద్వారా కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎఫ్‌సీఐకి ఇంకా లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయిలు చెల్లించాల్సి ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న హైదరాబాద్ నగరంలో కనీస మౌలిక సమస్యలను, డ్రైనేజీ వ్యవస్థలను పరిష్కరించలేని ఈ ప్రభుత్వం.. కొత్తగా 'ఫ్యూచర్ సిటీ' అంటూ పగటి కలలు కనడం విడ్డూరంగా ఉందన్నారు.నిరుద్యోగ భృతి, గ్రామీణాభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ వంటి ప్రతి అంశంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో ఎంత పంట ఉత్పత్తి అవుతుందో ముందుగానే అంచనా వేసి ప్రణాళికలు రూపొందించుకునే తెలివి ఈ ప్రభుత్వానికి లేదన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి ఇప్పటివరకు కేంద్రం ముందు ఒక్కటంటే ఒక్క బలమైన వాదన కూడా వినిపించలేకపోయారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ఇతర హామీల అమలుపై సమాధానం చెప్పాలని, లేదంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఎంపీ ధర్మపురి అరవింద్ హెచ్చరించారు.

# పర్యావరణ విధ్వంసానికి అడ్డేది..?

- ఏటేటా పెరుగుతున్న తీరు ఆందోళన కరం
- మృగ్యమవుతున్న అడవులు
- మురికికూపాలుగా మారుతున్న నదులు..
- ప్రాణాంతక వాయు కాలుష్యం
- చట్టాలు చుట్టాలైతే.. మనుగడకే ముప్పు
- ప్రకృతి ఆరాధన భారతీయ జీవన విధానం



**వాయిస్ ఆఫ్ వందే భారత్, స్పెషల్ డెస్క్ :** ప్రతి ఏటా జూన్ 5వ తేదీ రాగానే ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. మొక్కలు నాటడం, ఫొటోలకు పోజులివ్వడం, సైకిల్ ర్యాలీలు తీయడం వంటి హడావుడి కనిపిస్తుందే తప్ప, వాతావరణంలో ఆశించిన మార్పు రావడం లేదు. పాలకుల్లో చిత్తశుద్ధి లోపించడం, పర్యావరణ పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల 'ఎల్ నినో' వంటి ప్రకృతి ఉత్పాతాలు మానవాళిపై విరుచుకుపడుతున్నాయి. ఈ ఏడాది కూడా నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా ప్రవేశించడమే కాకుండా, జూన్ వచ్చినా ఎండల తీవ్రత తగ్గకపోవడం పర్యావరణ సంక్షోభానికి అద్దం పడుతోంది. ఒకప్పుడు జూన్ ప్రారంభానికే జోరు వానలు కురిసేవని, నేడు ఆ పరిస్థితి ఎక్కడా కానరాకపోవడం ఆందోళనకరం.

### ప్రకృతిపై దాడి..

పెరుగుతున్న జనాభానే పర్యావరణ విధ్వంసానికి ప్రథమ శత్రువుగా గుర్తించాలి. మానవుడు తన స్వార్థ అవసరాల కోసం ప్రకృతిపై విచక్షణారహితంగా దాడి చేస్తున్నాడు. ఊరూరా చెరువులను మింగేస్తూ, నాలాలను ఆక్రమిస్తున్నారు. ఇసుకను, మట్టిని తోడేస్తూ కొండలను ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. అడవులను నరికివేయడం వల్ల వన్యప్రాణులైన చిరుతలు, పెద్దపులులు జనావాసాల్లోకి వస్తున్నాయి. భూమి, నీరు, గాలి, అడవులు, జీవజాలాల కలయికే ప్రకృతి అనే కనీస స్పృహను మనిషి కోల్పోతున్నాడు. పంచభూతాలను రక్షించుకోవడం అన్నది మానవ మనుగడకు అత్యంత ఆవశ్యకం.

### భారతీయ సంస్కృతిలో 'ప్రకృతి' ఆరాధన

మన పూర్వీకులు బాహ్య, అంతర్గత పర్యావరణాల మధ్య ఉన్న సమతుల్యతను అద్భుతంగా అర్థం చేసుకున్నారు. భారతీయ సంస్కృతిలో యావత్ ప్రకృతిని దైవ స్వరూపంగా భావించారు. సౌరశక్తిని సూర్యదేవుడిగా, జలాన్ని దేవీ స్వరూపంగా, నదులను జీవనదాయినులైన మాతలుగా పూజించారు. అందుకే ఆనాడు నాగరికతలన్నీ నదీతీరాల్లోనే వికసించాయి. రావి, మర్రి, అరటి, తులసి, మామిడి వంటి వృక్షాలను పూజించడం వెనుక వాటిని రక్షించాలనే పర్యావరణ స్పృహ దాగి ఉంది. చెట్టూ–పుట్టా, కొండా–కోనా, పిట్టా–పిచుక ఇలా అన్నింటినీ కాపాడుకోవడమే పర్యావరణమని మన సంస్కృతి చాటిచెప్పింది.

### మురికికూపాలుగా జీవ నదులు

ఐక్యరాజ్యసమితి 1972లో స్వీడన్ వేదికగా 119 దేశాలతో నిర్వహించిన సమ్మేళనం ద్వారా ఈ పర్యావరణ దినోత్సవానికి శ్రీకారం చుట్టింది. ప్రజల్లో అవగాహన పెంచడమే దీని ముఖ్య ఉద్దేశం. భూగోళంపై 80 శాతం నీరు ఉన్నప్పటికీ, తాగడానికి ఉపయోగపడే స్వచ్ఛమైన నీరు 3 శాతం కంటే తక్కువగా ఉంది. లభిస్తున్న ఆ కొద్దిపాటి జలాన్ని కూడా మానవ తప్పిదాల వల్ల కలుషితం చేసుకుంటున్నాం. మనం పవిత్రంగా భావించే గంగ, యమున, గోదావరి వంటి నదులు నేడు పాలకుల నిర్లక్ష్యం, ప్రజల అలసత్వం వల్ల మురికి కాలువలుగా మారుతున్నాయి. పారిశ్రామిక రసాయనాలు, నగరాల వ్యర్థాలు నదుల్లో కలుస్తున్నా అడ్డుకునే నాథుడే కరువయ్యాడు.

### ప్లాస్టిక్ మహమ్మారి..

మరోవైపు పట్టణీకరణ, వాహనాల పొగ వల్ల వాయు కాలుష్యం పెరిగి ప్రాణవాయువు (ఆక్సిజన్) శాతం పడిపోతోంది. దేశంలో రోజుకు 15 వేల టన్నులకు పైగా ఉత్పత్తి అవుతున్న చెత్త భూసారాన్ని నాశనం చేస్తోంది. వందల ఏళ్లయినా భూమిలో కలవని ప్లాస్టిక్ వ్యర్థాలు భూమి ఉత్పాదక శక్తిని హరిస్తున్నాయి. వీటిని తినడం వల్ల పశుపక్ష్యాదులు ప్రాణాలు కోల్పోతున్నాయి.

### కఠిన చట్టాలే శరణ్యం!

పాలకుల విధ్వంసకర విధానాలు, పర్యావరణ చట్టాల అమలులో వైఫల్యం దేశాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయి. ఇప్పటికైనా పట్టణాల్లో పెద్ద ఎత్తున దేశీయ వృక్షాలను నాటడం, నదీ జలాలను సంరక్షించడం, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించడం వంటి కఠిన చర్యలు చేపట్టాలి. పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి నైతిక బాధ్యత. ప్రకృతిని మనం రక్షిస్తే.. ఆ ప్రకృతి మనల్ని రక్షిస్తుందనే సత్యాన్ని గ్రహించకపోతే మానవ జాతి మనుగడకే ముప్పు తప్పదు.

## పోలీసుల అదుపులో నేపాలీ గ్యాంగ్

- పుణెలో మరో నలుగురు నిందితుల పట్టివేత
- ముఠాలో మొత్తం ఆరుగురు అరెస్ట్
- హైదరాబాద్‌కు తరలిస్తున్న మల్కాజిగిరి పోలీసులు
- రిటైర్డ్ ప్రొఫెసర్ ఇల్లే లక్ష్యంగా సాగిన భారీ దోపిడీ

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన మల్కాజిగిరి పరిధిలోని రిటైర్డ్ ప్రొఫెసర్ నివాసంలో జరిగిన భారీ చోరీ కేసును రాచకొండ పోలీసులు దాదాపు ఛేదించారు. ఈ ఘాతుకానికి ఒడిగట్టిన అంతర్రాష్ట్ర 'నేపాలీ గ్యాంగ్'ను పోలీసులు పూర్తిగా అదుపులోకి తీసుకున్నారు. గతంలోనే ఈ కేసులో ఇద్దరు కీలక సూత్రధారులను అరెస్ట్ చేసిన పోలీసులు, తాజాగా మహారాష్ట్రలోని పుణె నగరంలో మాటువేసి మరో నలుగురు నిందితులను గుట్టుచప్పుడు కాకుండా పట్టుకున్నారు. దీనితో ఈ ముఠాకు చెందిన మొత్తం ఆరుగురు సభ్యులు ప్రస్తుతం పోలీసుల కస్టడీలో ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం.. గత నెలలో మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్న ఒక రిటైర్డ్ ప్రొఫెసర్ నివాసంలోకి అర్ధరాత్రి వేళ ఈ నేపాలీ ముఠా దొంగతనానికి చొరబడింది. ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని ఆసరాగా చేసుకుని, తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లిన దొంగలు.. బీరువాలో దాచి ఉంచిన లక్షలాది రూపాయల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదు, ఇతర విలువైన వస్తువులను ఊడ్చేసి పరారయ్యారు. నగరంలో కలకలం రేపిన ఈ చోరీపై బాధితుల ఫిర్యాదు మేరకు మల్కాజిగిరి పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. నిందితులు హైదరాబాద్ వదిలి మహారాష్ట్రకు పారిపోయినట్లు గుర్తించిన పోలీసులు, ప్రత్యేక బృందాన్ని పుణెకు పంపి స్థానిక పోలీసుల సహాయంతో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం కస్టడీలో ఉన్న ఆరుగురు నిందితులను పుణె నుంచి భారీ భద్రత నడుమ హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు మల్కాజిగిరి పోలీసులు వెల్లడించారు.

## యథాతథంగా రెపో రేటు

- ఆర్‌బీఐ ద్రవ్యపరపతి విధానం వెల్లడి
- 5.25 శాతం వద్దే కొనసాగనున్న కీలక వడ్డీ రేటు
- గవర్నర్ సంజయ్ మల్హోత్రా

**(మొదటి పేజీ తర్వాత.. )** ద్రవ్యోల్బణం అంచనాలను గతంలో అనుకున్న 4.6 శాతం నుంచి 5.1 శాతానికి పెంచుతున్నట్లు గవర్నర్ వెల్లడించారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలుగా ప్రభుత్వ సెక్యూరిటీల్లో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల నిబంధనలను ఆర్‌బీఐ సరళీకరించింది. అలాగే ఈక్విటీ మార్కెట్‌లో ఎన్‌ఆర్‌ఐలు, ఓవర్సీస్ సిటిజన్స్ పెట్టుబడుల పరిమితిని పెంచింది. ఎక్స్ఛేంజ్ రేట్‌పై ఆర్‌బీఐ విధానాల్లో ఎలాంటి మార్పు లేదు. దేశీయ కరెన్సీ రూపాయికి నిర్దిష్టమైన రేటును నిర్ణయించాలనుకోవడం లేదని స్పష్టం చేసింది. గతేడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ, జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్ల కోత పెట్టింది. ఆ తర్వాత డిసెంబరులో మరో పావుశాతం తగ్గించడంతో గతేడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. అయితే ప్రస్తుతం ప్రపంచ ఆర్థికవ్యవస్థ అనిశ్చితిలో కొనసాగుతోందని గవర్నర్ పేర్కొన్నారు.

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
శుక్రవారం, జూన్ 05, 2026

## అంచెలంచెలుగా ఎదిగిన
# జర్నలిస్టు రాములు



- నేడు జర్నలిస్టు టుడే టీవీ సీఈవో రాములు జన్మదినం
- వందలాది మంది జర్నలిస్టులకు మార్గదర్శి..
- సామాజిక సేవలోనూ అగ్రగామి




**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కాయకష్టం చేసుకుంటేనే కడుపు నిండే కడు పేద కుటుంబం.. చదువుకోవడమే గగనమైన గిరిజన తండా నేపథ్యం.. కానీ, కఠోర శ్రమ, మొక్కవోని దీక్ష ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని నిరూపించారు జర్నలిస్టు టుడే టీవీ ఛానల్ సీఈవో ఎం.రాములు. నాగర్ కర్నూలు జిల్లా లింగాల మండలం అపాయపల్లి గ్రామానికి చెందిన మూడవత్ హుమ్లా – లక్ష్మి దంపతుల ద్వితీయ కుమారుడైన రాములు, నేడు సభ్య సమాజంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుని నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

### పత్రికా రంగంలో సుదీర్ఘ ప్రస్థానం..

విద్యారంగంలో డిగ్రీతో పాటు హిందీ పండిత్ శిక్షణ పూర్తి చేసిన రాములు, చిన్నప్పటి నుంచే మీడియా రంగం వైపు ఆకర్షితులయ్యారు. 'ప్రజాశక్తి' తెలుగు దినపత్రికతో ప్రారంభమైన ఆయన జర్నలిజం ప్రస్థానం.. ఆ తర్వాత ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, సూర్య, మన తెలంగాణ, ఆదాబ్ హైదరాబాద్ లాంటి ప్రముఖ పత్రికల్లో మండల రిపోర్టర్ స్థాయి నుంచి జిల్లా స్టాఫర్, ఆర్సీ ఇన్‌ఛార్జ్‌గా నమ్మకమైన సేవలందించేలా సాగింది. ఎలక్ట్రానిక్ మీడియా రంగంలోనూ 'స్టూడియో ఎన్' ఛానల్‌లో సుదీర్ఘకాలం పనిచేసి తన ముద్ర వేశారు. ప్రస్తుతం అచ్చంపేటలో స్థిరనివాసం ఏర్పరచుకున్న ఆయన, హైదరాబాద్ కేంద్రంగా తెలుగు రాష్ట్రాల్లో (తెలంగాణ, ఏపీ) ప్రసారమవుతున్న 'జర్నలిస్టు టుడే' టీవీ ఛానల్‌కు సీఈవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

### జర్నలిస్టుల పక్షపాతి..

జర్నలిజంపై ఉన్న మక్కువతో వందలాది మంది యువతీ యువకులను జర్నలిస్టులుగా తీర్చిదిద్ది, వారికి ఉపాధి కల్పించిన ఘనత రాములుకు దక్కుతుంది. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించే ఆయన.. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పదేళ్ల పాటు సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించారు. ఆయన నేతృత్వంలోని 'జర్నలిస్టు టుడే' ఛానల్‌కు 2018 నుంచి ప్రభుత్వం అధికారిక అక్రిడేషన్ సౌకర్యం కల్పించడం ఆయన పనితీరుకు నిదర్శనం.

### సేవా రంగంలో 'ప్రజా చైతన్య'..

చిన్నతనం నుంచే సామాజిక సేవా కార్యక్రమాలపై మక్కువ చూపిన రాములు.. స్వయంగా 'ప్రజా చైతన్య స్వచ్ఛంద సంస్థ'ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా అనేక రక్తదాన శిబిరాలు, ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించి వేలాది మంది పేద ప్రజలను ఆదుకున్నారు. గిరిజన లంబాడి కుటుంబంలో పుట్టిన ఆయన, గిరిజనుల సమస్యలపై జరిగిన అనేక పోరాటాల్లో ముందున్నారు. ఎంతటి క్లిష్టమైన సమస్యనైనా సునాయాసంగా పరిష్కరించగల వ్యక్తిగా గిరిజన లంబాడి హక్కుల పోరాటాల్లో, కుల పెద్దల్లో మంచి పేరు ప్రఖ్యాతులు గడించారు.

### సోషల్ మీడియాలో ఫాలోయింగ్..

.సమాజంలో జరుగుతున్న పరిణామాలపై స్పందిస్తూ, ప్రజల పక్షాన నిలిచే రాములుకు సోషల్ మీడియాలోనూ లక్షలాది మంది ఫాలోవర్స్ ఉన్నారు. యువత అన్ని రంగాల్లో రాణించాలని, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే సాధించలేనిది ఏదీ లేదని ఆయన ఎప్పుడూ యువతకు దిశానిర్దేశం చేస్తుంటారు.

### పుట్టినరోజు శుభాకాంక్షలు..

అంచెలంచెలుగా ఎదుగుతూ ఎంతోమందికి ఆదర్శంగా నిలిచిన జర్నలిస్టు టుడే సీఈవో ఎం.రాములు శుక్రవారం తన పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పత్రికా ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు, స్నేహితులు, గిరిజన సంఘాల నాయకులు ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.




# సన్నవడ్ల సాగుతోనే రైతులకు ఆర్థిక పురోభివృద్ధి

- కర్ణాటకలోని గదక్ మార్కెట్ యార్డును సందర్శించిన వేములవాడ ఏఎంసీ పాలకవర్గం



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉన్న సన్నవడ్ల సాగు ద్వారా రైతులు ఆర్థికంగా బలోపేతమై సంపన్నులుగా మారవచ్చని వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్‌లు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు మార్కెట్ కమిటీ పాలకవర్గం, స్థానిక రైతులు కర్ణాటక రాష్ట్రంలో 'స్టడీ టూర్' చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం గదక్ నియోజకవర్గంలోని 156 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ఉన్న అంతర్రాష్ట్ర మార్కెట్ యార్డును వారు సందర్శించారు. అక్కడ జరుగుతున్న సన్నవడ్ల కొనుగోళ్లు, మార్కెటింగ్ విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గదక్ మార్కెట్ యార్డ్ సందర్శనలో భాగంగా వేములవాడ ఏఎంసీ బృందం అక్కడి స్థానిక రైతులు, మార్కెట్ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమైంది. కర్ణాటకలో సన్న వడ్ల సాగు పద్ధతులు, మార్కెటింగ్ సౌకర్యాలు, మద్దతు ధర మరియు సన్న రకాల వల్ల రైతులకు చేకూరుతున్న లాభాల గురించి వివరాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. అంతర్రాష్ట్ర మార్కెట్ అధ్యయన పర్యటనలో వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కత్తి కనకయ్య, పాలకుర్తి పర్శరాములు, ఖమ్మం గణేష్, మానుపాటి పర్శరాములు, చెరుకు శంకర్లతో పాటు వేములవాడ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రగతిశీల రైతులు పాల్గొన్నారు.

# కొత్త పెన్షన్ల హామీ ఏమైంది?

- ఎన్‌పీఆర్‌డీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలీశ్వర్



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించిన విధంగా జూన్ 2న కొత్తగా 2 లక్షల మందికి చేయూత పెన్షన్లను ఎందుకు మంజూరు చేయలేదని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల బాలీశ్వర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. అబద్ధపు హామీలతో పెన్షన్ దారులను ప్రభుత్వం ఘోరంగా మోసం చేస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా బాలీశ్వర్ మాట్లాడుతూ.. 2023 డిసెంబర్ నెలలో జరిగిన ప్రజాపాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న 11 రకాల చేయూత పెన్షన్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా 24.85 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నట్లు ప్రభుత్వం గతంలోనే ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లవుతున్నా, అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారుల్లో చలనం లేదని మండిపడ్డారు. తీరా, 2026 ఫిబ్రవరి బడ్జెట్ సమావేశాల్లో కొత్తగా 2 లక్షల మందికి జూన్ 2వ తేదీన చేయూత పెన్షన్లు మంజూరు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి, ఇప్పుడు మాట తప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నమ్మి లక్షలాది మంది దివ్యాంగులు, వృద్ధులు మీసేవా కేంద్రాల చుట్టూ తిరిగి సర్టిఫికెట్లు పొంది దరఖాస్తులు చేసుకున్నారని, కానీ జూన్ 2 ముగిసినా కొత్త పెన్షన్ల ఊసే లేకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి కొత్త పెన్షన్ల పంపిణీకి సంబంధించిన నిర్దిష్ట తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా జిల్లాలో మంత్రుల పర్యటనలను అడ్డుకోవడానికి కూడా వెనుకాడబోమని, ఇందుకు చేయూత లబ్ధిదారులంతా సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# పార్టీ కోసం పనిచేసిన వారికి తప్పక గుర్తింపు

- బీఆర్ఎస్ నేత శుభప్రద్ పటేల్



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి, పార్టీ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన ప్రతి ఒక్క కార్యకర్తకు, నాయకుడికి భవిష్యత్తులో తప్పకుండా తగిన గుర్తింపు ఉంటుందని బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమ అచ్చంపేట ఇంచార్జ్ శుభప్రద్ పటేల్ స్పష్టం చేశారు. శుక్రవారం పట్టణంలోని బి.కె ప్యాలెస్‌లో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోకల మనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అచ్చంపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సమన్వయ ముఖ్య నాయకుల సమావేశం' విజయవంతంగా జరిగింది. ఈ సమావేశానికి శుభప్రద్ పటేల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ పార్టీగా ప్రస్థానాన్ని ప్రారంభించి, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనన్నారు. "పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఈసారి బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తిగా ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తున్నాం. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అటవీ, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున డిజిటల్ సభ్యత్వ నమోదును చేపట్టి, ఈ కార్యక్రమాన్ని అత్యంత విజయవంతం చేయాలన్నారు. అదేవిధంగా కార్యకర్తల కోరిక మేరకు, త్వరలోనే అచ్చంపేట నియోజకవర్గానికి పూర్తిస్థాయి బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జిని నియమించేలా రాష్ట్ర అగ్ర నాయకత్వంతో చర్చిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమన్వయ సమావేశంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని మండలాల పార్టీ శ్రేణులతో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అమినోద్దీన్, హనుమంత్ రెడ్డి, గురువయ్య గౌడ్, పర్వతాలు ముదిరాజ్, మను పటేల్, కుత్బుద్దీన్, రమేష్ రావు, అంతటి శివ, జిలకర సాంబశివయ్య, కరుణాకర్ రావు, బండపల్లి వెంకటయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్లు తులసీరాం, నర్సింహ గౌడ్, గణేష్ రావు, కోట్ల నరేందర్ రావు, అంకూరి అంజి, అంకూ సురేందర్, తుమ్మల శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, కొత్త రవీందర్ రావు, బాలు నాయక్, కోనేటి తిరుపతయ్య, ఎడమ వెంకటయ్య, సోషల్ మీడియా ఇంచార్జి పిల్లి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ వందే భారత్ Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
శుక్రవారం, జూన్ 05, 2026

## భక్తులు, ప్రజల భద్రతే మా ముఖ్యం



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ పట్టణ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు స్పష్టం చేశారు. స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక ఆదేశాల మేరకు శుక్రవారం మున్సిపల్, పోలీస్, ఆర్ అండ్ బీ శాఖల అధికారుల బృందం క్షేత్రస్థాయిలో రంగంలోకి దిగింది. పట్టణంలో అత్యంత వాహనాల రద్దీగా ఉండే నంది కమాన్ చౌరస్తా ప్రాంతాన్ని చైర్మన్ అధికారులతో కలిసి ఉమ్మడిగా పరిశీలించారు. ఈ సందర్భంగా చౌరస్తా పరిసరాల్లో ప్రమాదాల నివారణకు, వాహనాల సులభతర రాకపోకలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా నంది కమాన్ చౌరస్తా పరిసర ప్రాంతాల్లో రహదారుల పక్కన వెలిసిన భారీ ఆక్రమణలను చైర్మన్ పుల్కం రాజు గమనించారు. రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసిన పండ్ల దుకాణాలు, తోపుడు బండ్లు, ఇతర వ్యాపార సముదాయాల వల్ల వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అలాగే కాలినడకన వెళ్లే భక్తులు, స్థానిక ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో రహదారులను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న నిర్వాహకులతో చైర్మన్ స్వయంగా మాట్లాడారు. భద్రతా కారణాల దృష్ట్యా తక్షణమే ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, సురక్షిత ప్రయాణానికి మున్సిపాలిటీకి సహకరించాలని వ్యాపారులకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. “దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ క్షేత్రానికి ప్రతిరోజూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు, వాహనాలు వస్తుంటారు. ఇక్కడికి వచ్చే భక్తుల, స్థానిక ప్రజల భద్రతకు మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించడానికి, ప్రమాద రహిత జోన్లుగా మార్చడానికి మున్సిపల్, పోలీస్, ఆర్ అండ్ బి అధికారులు ఉమ్మడి కార్యాచరణతో ముందుకు వెళ్తున్నాం.” అని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. నంది కమాన్ చౌరస్తా వద్ద భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా శాస్త్రీయ పద్ధతిలో స్పీడ్ బ్రేకర్లు, వాహనదారులను అప్రమత్తం చేసే సైన్ బోర్డుల ఏర్పాటుతో పాటు ట్రాఫిక్ జాంలు కాకుండా ముందస్తు చర్యలు చేపడతామని చైర్మన్ వెల్లడించారు. వేములవాడను సుందరంగా, సురక్షితమైన ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అన్ని శాఖలు కలిసికట్టుగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్ కాశ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, మారుపాక సర్పంచ్ దొబ్బల మల్లేశం, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులతో పాటు పోలీస్ శాఖకు చెందిన ఉన్నతాధికారులు, ఆర్ అండ్ బీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

## సాగునీటి ప్రాజెక్టులపై ఉన్నత స్థాయి సమీక్ష

- సీఎం రేవంత్ రెడ్డి సమీక్షలో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ
- పనుల వేగవంతం, సాగునీటి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చర్చ



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, తాజా పరిస్థితిపై గౌరవ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సమక్షంలో జరిగిన ఈ కీలక సమావేశానికి ఉమ్మడి జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు మరియు కాంగ్రెస్ సీనియర్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, ప్రస్తుత నీటి సరఫరా పరిస్థితి, మరియు ప్రస్తుతం కొనసాగుతున్న వివిధ పనులను మరింత వేగవంతం చేయాల్సిన ఆవశ్యకతపై విస్తృతంగా చర్చించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని ఈ సమావేశంలో అభిప్రాయపడ్డారు. అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని సాగునీటి అంశాలను కూడా ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

- ఐఎఫ్‌సీ కాంప్లెక్స్‌లో మొక్కల నాటిన విఐపీలు
- పర్యావరణ అవగాహనకు భారీ బైక్ ర్యాలీ



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఆధ్వర్యంలో, ‘ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక’ కార్యక్రమంలో భాగంగా అచ్చంపేటలోని ఇంటిగ్రేటెడ్ ఫారెస్ట్ కాంప్లెక్స్ నందు విఐపీ మొక్కల నాటకం, పర్యావరణ అవగాహన బైక్ ర్యాలీని అత్యంత ఘనంగా నిర్వహించారు. అచ్చంపేట ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ చంద్రశేఖర్ నేతృత్వంలో సాగిన ఈ కార్యక్రమం ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై విస్తృత అవగాహన కల్పించింది. ముందుగా ఇంటిగ్రేటెడ్ ఫారెస్ట్ కాంప్లెక్స్ ప్రాంగణంలో అటవీ శాఖ అధికారులు వివిధ రకాల మొక్కలను నాటి, వృక్షారోపణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... “ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో అడవులు, చెట్ల పాత్ర ఎంతో కీలకమైనది. కేవలం మొక్కలు నాటడమే కాకుండా, వాటిని సంరక్షించే బాధ్యతను కూడా అందరూ తీసుకోవాలన్నారు. అడవుల సంరక్షణ, జీవ వైవిధ్యం యొక్క ప్రాధాన్యతను ఈ సందర్భంగా వారు వివరించారు. మొక్కలు నాటే కార్యక్రమం అనంతరం, ఇంటిగ్రేటెడ్ ఫారెస్ట్ కాంప్లెక్స్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలన, వృక్షారోపణ ప్రాధాన్యతను చాటిచెప్పేలా వారు చేసిన నినాదాలు పట్టణ ప్రజలను ఆకట్టుకున్నాయి. మార్గమధ్యంలో ప్రజలందరూ పర్యావరణ హిత చర్యలను అలవర్చుకోవాలని అధికారులు కోరారు. ఈ విజయవంతమైన కార్యక్రమంలో అటవీ శాఖకు చెందిన ఫ్లయింగ్ స్క్వాడ్ డిపార్ట్మెంట్ కు చెందిన సహాయ అటవీ సంరక్షణ అధికారి రామమోహన్, అచ్చంపేట అటవీ క్షేత్రాధికారి ఎం.ఏ.సుబూర్, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, ఫీల్డ్ స్టాఫ్, బేస్ క్యాంప్ వాచర్లు. పాల్గొన్నారు. పర్యావరణాన్ని కాపాడటానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సామాజిక బాధ్యతగా మొక్కలను నాటాలని అధికారులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.





## భీమేశ్వరుడి చెంత ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

- పుట్టినరోజు సందర్భంగా పూజలు
- ఎమ్మెల్యేకు వేదాశీర్వచనం, తీర్థప్రసాదాలు



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు, కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం తన జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు మరియు అభిషేకాలు నిర్వహించారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు ఆలయ అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో, మంగళవాయిద్యాల నడుమ స్వస్తి సూక్తాలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు ఆయనకు ఘనంగా వేదాశీర్వచనం అందజేసి, ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రోటోకాల్ పర్యవేక్షకులు గౌరీభట్ల శ్రీనివాస్ శర్మ ఎమ్మెల్యేకు స్వామివారి శేషవస్త్రం కప్పి, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. తన పుట్టినరోజు సందర్భంగా స్వామివారి కృపాకటాక్షాలు అందడం సంతోషంగా ఉందని, రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో వర్ధిల్లాలని స్వామివారిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## కోనోకార్పస్ చెట్లను నిర్మూలించాలి

**ఆత్మకూరు, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని గూడెప్పాడ్ గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న కోనోకార్పస్ చెట్లను తక్షణమే తొలగించాలని కోరుతూ శుక్రవారం గ్రామ పంచాయితీ కార్యాలయంలో సెక్రటరీ సంపూర్ణకు వినతి పత్రం అందజేశారు. సర్పంచ్ రమేష్ బాబు సమక్షంలో బీజేపీ వార్డు మెంబర్లు కందకట్ల లలిత, బలభద్ర దినేష్, బలభద్ర మౌనికలు ఈ వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోనోకార్పస్ చెట్ల వల్ల ప్రజల్లో శ్వాసకోశ సంబంధిత సమస్యలు, అలర్జీలు వస్తున్నాయని, అలాగే భూగర్భ జలాలు హరించుకుపోయి పర్యావరణ అసమతుల్యత ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి గ్రామంలో ఉన్న కోనోకార్పస్ చెట్లను దశలవారీగా పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. వాటి స్థానంలో పర్యావరణానికి మేలు చేసే మన దేశీయ వృక్ష జాతుల మొక్కలను నాటి, వాటిని సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు. ఉపసర్పంచ్ ఓరుగంటి కరుణాకర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, వార్డు మెంబెర్ బుచ్చిరెడ్డి, కందకట్ల దిలీప్, బలభద్ర చిరంజీవి పాల్గొన్నారు.